
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
విజయనగరం
జిల్లా వార్తలు
గురువారం 11 సెప్టెంబరు 2025



నేపాల్‌లో జిల్లా యాత్రికులు సురక్షితం
● కలెక్టర్ అంబేడ్కర్

జిల్లా నుంచి మానస సరోవర యాత్రకు వెళ్లిన 61 మంది క్షేమంగా ఉన్నారు. వారిని సురక్షితంగా జిల్లాకు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాం. యాత్రికులతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి నారా లోకేశ్ కూడా అక్కడి వారితో మాట్లాడుతున్నారు. 61 మంది యాత్రికులు వివరాలను మంత్రి లోకేశ్‌కు పంపించాం. వారంతా ఖాట్మండ్ నుంచి గురువారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో రాష్ట్రానికి చేరుకోనున్నారు.

పర్యటనకు వెళ్లి.. నేపాల్‌లో చిక్కుకుని


కర్మాండూలోని హోటల్‌లో ఉన్న జిల్లా యాత్రికులు

● జిల్లా నుంచి మానస సరోవర్ యాత్రకు వెళ్లిన 61 మంది
● వారం రోజుల కిందట పయనం ● కల్లోలంగా తయారైన నేపాల్
● బంధువుల్లో టెన్షన్ ● రోయల్ కుసుమ్ హోటల్లో వసతి
● అందరూ క్షేమంగా ఉన్నట్లు గుర్తించిన జిల్లా అధికారులు
● యాత్రికులతో ఫోన్‌లో మాట్లాడిన కలెక్టర్ అంబేడ్కర్
● వారికి మంత్రులు భరోసా



విజయనగరం/కలెక్టరేట్ సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

జిల్లా నుంచి మానస సరోవర్ యాత్రకు వెళ్లిన 61 మంది నేపాల్‌లోని కర్మాండూలో చిక్కుకున్నారు. సామాజిక మాధ్యమాలపై నిషేధాన్ని వ్యతిరేకిస్తూ నేపాల్‌లో నెలకొన్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో మనవారంతా ఆ దేశంలో ఉండడంతో ఇక్కడి బంధువుల్లో టెన్షన్ నెలకొంది. అయితే యాత్రికుల వివరాలను జిల్లా అధికారులు సేకరించారు. ప్రస్తుతం అక్కడ క్షేమంగానే ఉన్నారు. వారితో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. మంత్రులు లోకేశ్, అనిత, శ్రీనివాస్‌లు మాట్లాడి భరోసా ఇచ్చారు. రాష్ట్రానికి వెంటనే తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు.

గత రెండు రోజులుగా నేపాల్‌లోని యువత వీధుల్లోకి వచ్చి అలజడి సృష్టిస్తోంది. దీంతో అక్కడి వాతావరణం హింసాత్మకంగా మారింది. ఈ ఘటనలు జరగక ముందే జిల్లా నుంచి వారం రోజుల క్రితం మానస సరోవర్ యాత్రకు ట్రైన్‌లో 61 మంది వెళ్లారు. విజయనగరం గాజుల రేగకు చెందిన వారు ఎక్కువ మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వారంతా ఖాట్మండులోని (మిగతా 8వ పేజీలో..)



● అవగాహన లోపమంటున్న అధికారులు
● అవసరానికి మించి వాడొద్దని సూచనలు
● వాణిజ్య పంటలకూ మళ్లిస్తున్న కొందరు
● బస్తా యూరియాపై ప్రభుత్వ సబ్సిడీ రూ.1967
● రూ.266కే రైతులకు అందజేత



ఎరువు కొరత ఉందా?

మొక్కజొన్నకూ వాడుతున్నాం

యూరియాను వరి, మొక్కజొన్న పంటలకూ వాడుతున్నాం. అధిక దిగుబడి వస్తుందని చెప్తే తీసుకుంటున్నాం. పంటకు చీడపీడలు ఇబ్బంది పెడుతున్నాయి. ఇకపై జాగ్రత్తగా ఉంటాం.
- ఎస్.శ్రీనివాసరావు, రైతు, కొండ లింగాలవలస

మెంటాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):

యూరియా కోసం బారులు.. గంటలకొద్దీ నిరీక్షణలు.. ఘర్షణలు.. వాగ్వాదాలు.. గొడవలు. జిల్లాలో కొద్ది రోజులుగా ఎక్కడ చూసినా ఇవే ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఏ రైతును కదిపినా ఒకటే మాట. యూరియా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నిజంగా అంత కొరత ఉందా? అంటే లేనే లేదని అధికారులు చెబుతున్నారు. ఎరువుల వాడకంపై రైతుల్లో అవగాహన లోపముందని, అదే సమయంలో అమాయకత్వం కూడా ఉందనేది అధికారుల మాట. మిగిలిన ఎరువుల కన్నా ప్రభుత్వ సబ్సిడీ ఉండడం, తక్కువ ధరకు లభ్యమవడంతో రైతులు యూరియాపైనే దృష్టి పెట్టడం ఇంకో కారణంగా పేర్కొంటున్నారు. కాగా రెండు విడతలుగా ప్రభుత్వం కావలసినంత ఎరువు సరఫరా చేస్తున్నా మలివిడతలో దొరుకుతుందో లేదో అనే సంశయంతో కొందరు రైతులు రెండు విడతల ఎరువును ఒకేసారి కొనుగోలు చేస్తున్నారు. రైతులకు వాస్తవాలు వివరించి వారికి ధైర్యం చెప్పాల్సిన రాజకీయ నాయకులు ఆ బాధ్యతలను విస్మరించి రైతుల ఆందోళనతో రాజకీయం చేస్తున్నారు.

● 120 రోజుల కాలపరిమితి గల వరి పంటకు 60రోజుల వ్యవధిలో రెండు లేదా మూడు పర్యాయాలు చొప్పున ఎకరాకు 40 కిలోల యూరియా వేయాల్సి (మిగతా 8వ పేజీలో..)

అవగాహన లోపమే అసలు కారణం

ఎరువుల వినియోగంపై రైతుల్లో అవగాహన లోపమే అనేక సమస్యలకు కారణం.యూరియా కొరత కూడా అటువంటిదే.నిజానికి మెంటాడ మండలంలో డిమాండ్‌కు మించి యూరియా సరఫరా జరిగింది. కొందరు వాణిజ్య పంటలకూ వాడుతున్నారు. ఎరువులు అతి వాడకం వల్ల పంటలకూ నష్టమే. పలురకాల తెగుళ్లబారిన పడి ఆర్థికంగా నష్టపోవాల్సిఉంటుంది. పాము పొడ, అగ్గితెగులుతో పాటు లద్దె పురుగు, ఆకుముడత పురుగు, ఉల్లి కోడు, దోమపోటుతో వరి పంటకు నష్టం వాటిల్లుతుంది. దిగుబడి తగ్గుతుంది.
- గోకుల కృష్ణ, వ్యవసాయాధికారి, మెంటాడ

ఢిల్లీని తాకిన నిరసన సెగ
● జంతర్ మంతర్ వద్ద జిందాల్ నిర్వాసితుల పోరాటం
● హాజరైన ఎమ్మెల్సీ రఘురాజు



జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న జిందాల్ నిర్వాసితులు, ఎమ్మెల్సీ రఘురాజు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితుల నిరసన సెగ ఢిల్లీని తాకింది. బొడ్డవర గ్రామంలో 80 రోజులుగా శిబిరం ఏర్పాటు చేసుకుని శాంతియుతంగా పోరాడుతున్న వారు తమ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి రైలులో ఢిల్లీకి మంగళవారం బయలుదేరారు. బుధవారం జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు దిగారు. నినాదాలతో హోరెత్తించారు. జిందాల్ యాజమాన్యం నిర్వాసితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జిల్లా రైతుసంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. 18ఏళ్ల క్రితం కంపెనీ ఏర్పాటు చేస్తామని జిందాల్ యాజమాన్యం తీసుకున్న భూములను వెనక్కి ఇవ్వాలని, నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తొలుత మోకాళ్లపై కూర్చుని జాతీయ జెండాలు చేతపట్టి నిరసన తెలిపారు. అనంతరం ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేశారు. తమ నిరసనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా ఢిల్లీ ప్రభుత్వం కోరిన వెంటనే ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం భూసేకరణలో ఎన్నో తప్పులకు పాల్పడిందని, అడుగడుగునా రైతులను మోసం చేసిందన్నారు. ధర్నా అనంతరం జిందాల్ నిర్వాసితులు బుధవారం సాయంత్రం జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ హుస్సేన్‌నాయక్‌ను కలిశారు.

3 కిలోమీటర్లు డోలీలో..
● పొలం గట్ల మీదుగా మహిళను మోసుకెళ్లిన గిరిజనులు



బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ గిరిజన మహిళను ఆస్పత్రికి తరలించేందుకు ఆ కుటుంబ సభ్యులు డోలీ కట్టారు. మూడు కిలోమీటర్లు రాళ్లు, పొదలు, ఆపై కాలువ గట్లపై నుంచి నడిచారు. కష్టమైనా.. భారమైనా రహదారి లేక అవస్థలు పడుతూనే ఆమెను ప్రధాన రహదారి వద్దకు చేర్చారు.

బొబ్బిలి మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధి మోసాయివలస గ్రామానికి చెందిన చోడిపల్లి ఆశమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు వారం కిందట కేజీహెచ్‌లో ఆపరేషన్ అయింది. కుట్లు తొలగించేందుకు వైద్యులు మరోసారి రమ్మని చెప్పారు. ఇందుకోసం బుధవారం విశాఖకు బయలుదేరగా గ్రామం నుంచి ప్రధాన రహదారి వరకు ఎలాంటి రోడ్డు లేదు. కుటుంబ సభ్యులు చేసేదిలేక డోలీ కట్టారు. ఉదయానే గ్రామం నుంచి బయలుదేరారు. మూడు కిలోమీటర్ల దూరంలో పొదలను, పొలం గట్లను దాటుకుని నారసింహునిపేట వద్దకు చేర్చారు. అక్కడున్న వాహనంలో విశాఖపట్నం తరలించారు. దశాబ్దాలు గడిచినా గిరిజనుల బతుకులు మారడం లేదని, మౌలిక సదుపాయాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని, కనీసం రోడ్డు వేయడానికి కూడా పాలకులు ముందుకు రాకపోవడం అన్యాయమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



అప్పుడప్పుడే తనిఖీలు

● మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న యువకులు
● జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
● నిత్యం చేపట్టని డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
● గంజాయి మత్తులోనూ వాహనాలు నడుపుతున్న వైనం

రాజాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):

రాజాం పట్టణంలో సాయంత్రం 4 గంటలు దాటితే చాలు కుర్రకారు రెచ్చిపోతున్నారు. కాలేజీలు, విద్యాసంస్థలు విడిచిపెట్టే సమయం కావడంతో రేసు బైకులతో హల్‌చల్ చేస్తున్నారు. ఇక మందుబాబుల హడావిడే వేరు. తాగి డ్రైవింగ్ చేస్తూ తోటి వాహనదారులను అసౌకర్యానికి గురిచేస్తున్నారు. ఇటీవల పట్టణంలో గంజాయి మత్తులో కొందరు యువకులు రెచ్చిపోయిన ఘటనలు వెలుగుచూశాయి. రాజాంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన పట్టణాల్లో ఇదే పరిస్థితి ఉంది. జూన్ 28న జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేసింది. ఆ ఒక్కరోజే 67 మంది పట్టుబడ్డారు. ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలు జరిమానాగా వసూలు చేశారు. ప్రభుత్వానికి రూ.6.7 లక్షల ఆదాయం సమకూరింది. అటు తరువాత డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు అటకెక్కాయి. ఆశించిన స్థాయిలో జరగడం లేదు. నెలలో ఒకసారి తనిఖీలు చేసి మమ అనిపించేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

పెరుగుతున్న ప్రమాదాలు

విజయనగరంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో యువత, మందుబాబులు తాగి వాహనాలు డ్రైవ్ చేస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. అయితే వివిధ బీమా క్లైములు రావన్న కారణాలతో మృతుడి కుటుంబసభ్యులు మద్యం తాగడం వల్ల కాదని ధ్రువీకరిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం మాత్రం ప్రమాదకరం. అది రహదారి భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది. తాగి వాహనం నడిపేవాడే కాదు.. రోడ్డుపై ప్రయాణించే ఇతరులు సైతం మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటోంది. అందుకే డ్రంకెన్ డ్రైవ్ కేసుల విషయంలో న్యాయస్థానాలు సైతం తీవ్రంగా స్పందిస్తుంటాయి. అయితే జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ కేసులు తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. జాతీయ రహదారి, అంతర్ రాష్ట్ర, జిల్లా రహదారులు ఉన్నా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు విరివిగా చేయడం లేదు.

● జిల్లాలో భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో దాదాపు (మిగతా 8వ పేజీలో..)

గంజాయి రవాణా కేసులో 12 ఏళ్ల కఠిన కారాగార శిక్ష
● ఏడీజే న్యాయాధికారి తీర్పు
● వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కోట పోలీసుస్టేషన్‌లో 2018లో నమోదైన గంజాయి రవాణా కేసులో నిందితుడికి 12 ఏళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ విజయనగరం ఒకటో ఏడీజే న్యాయాధికారి ఎం.మీనాదేవి బుధవారం తీర్పు చెప్పారు. ఆ వివరాలను ఎస్పీ వకుల్ జిందాల్ విలేకరులకు తెలిపారు.

ఎస్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలోని బొడ్డవర చెక్‌పోస్టు వద్ద 2018 ఫిబ్రవరి 19న తనిఖీలు చేస్తున్న పోలీసులకు గంజాయి తరలిస్తున్న వ్యాన్ పట్టుబడింది. అందులో ఉన్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన సంతూ మూజిమ్‌దార్, అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం దుప్పలవాడ గ్రామానికి చెందిన ఫంగి ధనుంజయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 66.2 కిలోల గంజాయిని ఎస్‌కోట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి సీఐ వై.రవికుమార్ నిందితులను రిమాండ్‌కు తరలించి న్యాయస్థానంలో అభియోగ పత్రాలు దాఖలు చేశారు. నిందితుడు ఫంగి ధనుంజయ్‌పై నేరారోపణలు రుజువు కావడంతో 12 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. కేసులో ప్రధాన నిందితుడు సంతూ మూజిమ్‌దార్ విచారణ సమయంలో మరణించాడని ఎస్పీ తెలిపారు.



మహిళ హత్య కేసులో జీవిత ఖైదు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కొత్తవలస కుమ్మరవీధిలో నివాసం ఉంటున్న మహిళపై 2023లో తీవ్రంగా దాడి చేసి ఆమె మెడలోని బంగారు వస్తువులను పట్టుకుపోయిన ఎల్.కోట మండలం జమ్మాదిపేట గ్రామానికి చెందిన నిందితుడు మడబత్తుల కృష్ణకు విజయనగరం ఏడీజే న్యాయాధికారి ఎస్.పద్మావతి జీవిత ఖైదుతో పాటు వెయ్యిరూపాయల జరిమానా విధించారు. ఆ వివరాలను ఎస్పీ వకుల్‌జిందాల్ విలేకరులకు బుధవారం తెలిపారు.

కొత్తవలస పట్టణం కుమ్మరవీధిలో మడబత్తుల సూర్యకాంతం తన కుమారుడితో కలిసి నివాసం ఉంటోంది. 2023 ఏప్రిల్ 15న గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఆమె తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచి కారం జల్లి మెడలోని బంగారు పుస్తులతాడు, చెవిదిద్దులను అపహరించుకుపోయారు. చికిత్స కోసం సూర్యకాంతంను కేజీహెచ్‌కి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించడంతో ఆమె మృతిచెందింది. ఆమె అన్న సోదా అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ బాల సూర్యారావు విచారణ జరిపి నిందితుడు మడబత్తుల కృష్ణని అరెస్టు చేశారు. అనంతరం న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేశారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో న్యాయాధికారి తాజాగా తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు.

ఉరిమే ఉత్సాహం.. సభలో ఉల్లాసం.. స్త్రీ శక్తి..!



సూపర్ హిట్

చంద్రన్న ప్రభుత్వానికి జై కొట్టిన జనం



కింద చోటు లేదు.. అందుకే ఇంతెత్తుకు..!

అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.



మూడు జెండాలు.. మురిపించిన నేతలు





పవనిజం..

యువతరం ఉత్సాహం..

బాక్స్ క్రికెట్.. బస్తీల్లోనూ హిట్

- ఆసక్తి చూపుతున్న యువత
- ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో ఆటలు

సాలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

బాక్స్ క్రికెట్... ఇటీవల ఎక్కువ మంది విద్యార్థులు, యువత నుంచి వినిపిస్తున్న మాట. ఒకప్పుడు వీధుల్లోనూ... ఎండిపోయిన చెరువుల్లోనూ... ఖాళీ స్థలాల్లోనూ... పాఠశాలల ఆవరణల్లోనూ... చిన్నాపెద్దా క్రికెట్ ఆడుతూ కనిపించేవారు. ఇప్పుడు రోజులు మారాయి. చిన్న చిన్న పట్టణాలు, పల్లెల్లో సైతం ఖాళీ ప్రదేశాలు కనిపించడం లేదు. ఆటలకు చోటే ఉండడం లేదు. దీంతో ఒకప్పుడు మెట్రో పాలిటన్ నగరాలకే పరిమితమైన బాక్స్ క్రికెట్ ఇప్పుడు చిన్న పట్టణాలకు చేరువైంది. పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు విజయనగరం జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల ఈ చిట్టి క్రీడా మైదానాలు కనిపిస్తున్నాయి. వీటిలో జోరుగా పోటీలు కూడా సాగుతున్నాయి.



సాలూరులో బాక్స్ క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

ఉదయం నుంచి రాత్రి వరకు...

జిల్లాలో సాలూరు పట్టణంతో పాటు అనేక నగరాలు, పట్టణాల్లో, సాలూరు పట్టణంలో ప్రత్యేకించి బాక్స్‌లు వెలిశాయి. యువకులు అద్దె స్థలాల్లో పెట్టుబడులు పెట్టి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. వీటికి ప్రస్తుతం చాలా డిమాండ్ ఏర్పడింది. విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు టీములుగా ఏర్పడి ఇక్కడ ఆడుతున్నారు. శని, ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో ఇవి కిటకిటలాడుతున్నాయి. కొన్నిచోట్ల ఏకంగా ముందస్తు కేటాయింపులు నడుస్తుండడం విశేషం. ఉదయం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఫ్లెడ్‌లైట్ల వెలుగుల్లో బాక్స్ మైదానాలు కేరింతలతో హోరెత్తుతున్నాయి. అర ఎకరా నుంచి 2 ఎకరాల విస్తీర్ణంలో ఈ చిట్టి క్రికెట్ మైదానాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో మైదానం సిద్ధం చేయడానికి సుమారు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు వెచ్చిస్తున్నారు. కొన్నిచోట్ల క్రికెట్‌తో పాటు వాలీబాల్, ఫుట్‌బాల్ కూడా ఆడుకునే సదుపాయం ఉంటోంది. వీటి వినియోగానికి గంటలు, రోజుల లెక్కన నిర్వాహకులు రుసుం వసూలు చేస్తున్నారు.



కుటుంబ సమేతంగా...

ఉద్యోగ, వ్యాపార ఒత్తిళ్లతో సతమతమవుతూ కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించలేని వారు ప్రస్తుత రోజుల్లో ఎంతో మంది ఉన్నారు. వీరిలో కొంతమంది వారాంతాల్లో కుటుంబాలతో గడపడానికి బాక్స్ క్రికెట్‌ను వేదికగా చేసుకుంటున్నారు. కొన్ని గంటల పాటు మైదానాలను అద్దెకు తీసుకొని కుటుంబాలతో సరదాగా గడుపుతున్నారు.

ఒత్తిడి తగ్గడానికి...

వారమంతా ఉద్యోగ విధుల్లో అలసిపోతాం. మానసికంగా చాలా ఒత్తిడికి గురవుతున్నాం. ఒత్తిడి తగ్గాలంటే ఏదో ఒక ఆటవిడుపు ఉండాల్సిందే. అందుకే డబ్బు వెచ్చించి బాక్స్ క్రికెట్‌కు వస్తున్నాను. సమయం దొరికినప్పుడు తప్పకుండా స్నేహితులతో ఆడుతున్నా. సాలూరు పట్టణంలో ఇలాంటి బాక్స్ క్రికెట్‌ను ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది.

-శ్రీనివాస్, బ్యాంకు ఉద్యోగి, సాలూరు

రాత్రి వేళ ఆడుకునేందుకు వీలుగా...

సాలూరులో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్‌లో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయడం వల్ల రాత్రిపూట కూడా ఆడుకునే అవకాశం ఉంది. వర్షం కురిసినా, ఎండల్లో కూడా ఆడుకోవడానికి అనువుగా ఉంది. రోజంతా విధులు నిర్వహించి... రాత్రివేళ ఆడుకుంటాం. వారానికి నాలుగుసార్లు బాక్స్ క్రికెట్ ఆడుతుంటాను.

-రాజేష్, ఉద్యోగి, సాలూరు

టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పీఎస్సార్ స్కూల్‌లో బుధవారం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17కు బాలికల టేబుల్ టెన్నిస్, మాల్కంబ జట్లను ఎంపిక చేసినట్టు డిప్యూటీ డీఈవో కె.వెంకటరమణ తెలిపారు. ఈ ఎంపికలకు 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడాకారుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు స్కూల్స్ గేమ్స్ ఉపయోగపడతాయని తెలిపారు. టేబుల్ టెన్నిస్ కార్యదర్శి కృష్ణమూర్తి, తవిటయ్య, రత్నకిషోర్, శ్రీను, రవి, ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో డిప్యూటీ డీఈవో వెంకటరమణ

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

- జిల్లా న్యాయాధికారి బబిత



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి బబిత

విజయనగరం క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఈ నెల 13న జరుగనున్న జాతీయ లోక్‌ఆదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూసి... విజయవంతం చేయాలని జిల్లా న్యాయాధికారి బబిత పిలుపునిచ్చారు. విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల్లోని న్యాయాధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద బీమా కేసులు, బ్యాంకులు, చెక్కు బౌన్సు కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, విద్యుత్, ఎక్సైజ్ కేసులు, భూ సంబంధిత, మున్సిపాలిటీ, ప్రీలిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారమయ్యేలా చేయాలన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌ను పోలీసు అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్, న్యాయాధికారులు మీనాదేవి, ఎం.పద్మావతి, కె.నాగమణి, జి.దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌశలం గుర్తించేందుకు..

- జోరుగా వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే
- నిరుద్యోగుల వివరాలు నమోదు

గజపతినగరం/విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. ఈ క్రమంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా గతంలో 'కౌశలం' పేరుతో వర్క్ ఫ్రం హోమ్ సర్వేను చేపడుతోంది. జిల్లాలో నిరుద్యోగులు ఎంత మంది ఉన్నారు? ఎంతవరకు చదువుకున్నారు? ఎటువంటి ఉద్యోగానికి వెళ్లాలని అనుకుంటున్నారు? తదితర వివరాలను సర్వే బృందం సేకరిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ శాఖ సిబ్బంది సర్వేను వేగవంతం చేస్తున్నారు. సర్వే పూర్తి చేసి... నివేదికను ప్రభుత్వానికి అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. నిరుద్యోగుల వివరాలు సేకరించేలా పని విభజన చేశారు. దూరప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగుల వివరాలు, సంబంధిత కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. ఐటీ సెక్టారులో ఉన్న వారి వివరాలను నమోదు చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి... నిరుద్యోగుల విద్యార్హతను బట్టి ఎటువంటి ఉద్యోగం కావాలని అనుకుంటున్నారో అడగడంతో పాటు శిక్షణ తీసుకుంటారా? అని వివరాలు సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 18 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారి విద్యార్హతల సమాచారంతో సచివాలయాలకు జాబితాలు చేరుకుంటున్నాయి. డిప్లమో, డిగ్రీ, ఇంజనీరింగ్‌తో పాటు ఉన్నత చదువులు పూర్తి చేసిన వారిలో గృహిణులూ ఉన్నారు. సచివాలయ సిబ్బంది వారి వివరాలను కూడా సేకరిస్తున్నారు. వేలిముద్ర, ఐరిస్ తీసుకుంటున్నారు. విద్యార్హతలను బట్టి వర్క్ ఫ్రం హోమ్‌లో ఏ తరహా ఉద్యోగం కావాలో అడిగి నమోదు చేసుకుంటున్నారు. ప్రభుత్వం అందించే శిక్షణకు హాజరవుతారా? అని వివరాలు సేకరిస్తున్నారు. దీంతో నిరుద్యోగులు తమ భవిష్యత్తుకు భరోసా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





గజపతినగరం: మరుపల్లిలో ఇంటింటి సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

పదో తరగతి నుంచి..

పదో తరగతి, ఇంటర్, డిప్లమో నుంచి పీజీ వరకూ చదివిన వారు కౌశలం సర్వేలో నమోదు చేసుకోవచ్చును. ఈ సర్వేలో పాల్గొన్న వారి అర్హతలను అనుసరించి ప్రభుత్వం నుంచి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళిక రచిస్తోంది. దీని ద్వారా యువత ఆర్థికంగా ఎదగడానికి తోడ్పతుందని భావిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత సచివాలయాల్లో నమోదు చేసుకోవడంతో పాటు... ఎవరికి వారు సొంతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించింది.

● దరఖాస్తు ఇలా..

హెచ్‌టీటీపీః//జీఎస్‌డబ్ల్యూఎస్-ఎన్‌బీఎం.ఏఎ.జీఓవీ.ఇన్/బీఎం/వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చును. అక్కడ కనిపించే విండోలో వర్క్‌ఫ్రమ్ హోం ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి.

- ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు, ఈమెయిల్ వంటి వివరాలను నమోదు చేసి ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకోవాలి.
- తరువాత అభ్యర్థుల విద్యార్హతలు, మార్కులు, చదివిన కళాశాల, గ్రూప్ వంటి వివరాలు పూర్తిగా నింపాలి.
- అత్యున్నత విద్యార్హతలకు సంబంధించిన మార్కుల జాబితాను (పది, ఇంటర్ చదివిన అభ్యర్థులు కాదు) అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- విజయనగరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 10,377 మంది వివరాలు నమోదు చేసుకున్నారు. ఎవరికి వారు సొంతంగా 2,765 మంది దరఖాస్తు చేశారు.

కొండెక్కిన కోడి ధర

- కిలో రూ. 260



సాలూరులో విక్రయానికి ఉంచిన కోళ్లు

సాలూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోడి మాంసం ధర కొండెక్కింది. గత కొద్ది రోజులుగా కోడి మాంసం ధరలు పెరుగుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో లైవ్ కోడిని బుధవారం రూ.148కి విక్రయించారు. కోడి మాంసం కిలో రూ.260కు విక్రయించారు. ఇలా ధరలు పెరుగుతుండడంతో మాంస ప్రియులు ఆందోళన చెందుతున్నారు. ఆర్థిక భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం కిలో రూ.220 ఉండగా... ప్రస్తుతం కిలో రూ.260 వరకు విక్రయి స్తున్నారు. లైవ్ కోడి సైతం కిలో రూ.110 నుంచి రూ.120 వరకు ఉండేది. ప్రస్తుతం రూ.148కి పెరగడంపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ పరిసర ప్రాంతాల నుంచి కోళ్ల సరఫరా తగ్గడంతో వ్యాపారులు రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి రప్పిస్తున్నారు. దీంతో పార్వతీపురం మన్యం జిల్లాకు చేరుకునేటప్పటికి రవాణా ఖర్చులు అధికం కావడంతో మాంసం ధర పెరుగుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.

మక్కువలో భారీ వర్షం



మక్కువ ప్రధాన రహదారిపై వర్షపునీరు

మక్కువ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మక్కువలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంట సేపు వర్షం కురవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఎండ తీవ్రతకు అల్లాడిన ప్రజలు వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. మార్కెట్‌లో కూరగాయలు విక్రయించే వ్యాపారులు తమ సరుకులు కాపాడుకొనేందుకు అవస్థలు పడ్డారు. స్థానిక ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపై మురుగునీరు ప్రవహించింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు చాలాసేపు ఆటంకం కలిగింది.



విశాఖ-అరకు ప్రధాన రహదారిలో బొడ్డవర వద్ద రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్త

నిర్వహణ లేక.. సంపద సృష్టించలేక

● పేరుకుపోతున్న చెత్త ● ఇదీ బొడ్డవర వద్ద పరిస్థితి

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర శివారులో చెత్త నిర్వహణ లేక పేరుకుపోతోంది. చెత్త నుంచి సంపద సృష్టిస్తామని చేస్తున్న ప్రకటనలు అటకెక్కుతున్నాయి. ఇక్కడి అరకు-విశాఖ ప్రధానరహదారికి ఆనుకొని పంచాయతీ సిబ్బంది డంపింగ్‌యార్డుగా మార్చేశారు.ప్రతిరోజూ గ్రామంలో చెత్తను చెత్తసంపద కేంద్రానికి తరలించి తడిచెత్త పొడిచెత్త వేరుచేయాల్సిఉంది. అయితే కొద్దిరోజులుగా చెత్త పోగుచేస్తున్నా వేరుచేయడం లేదు. గ్రీన్‌అంబాసిడర్లు సేకరించిన చెత్తను తమ రిక్షాలతో ఇక్కడే వేస్తున్నారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు కుళ్లడంతో దుర్వాసన వెలువడుతోంది. తక్షణమే చెత్త నిర్వహణపై దృష్టిసారించి సంపద సృష్టించడానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అన్ని గ్రామాల రైతులతో చర్చించండి

● గ్రామాల వారీగా గ్రామసభలను ఏర్పాటు చేయాలి ● ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో భూములు కోల్పోయిన రైతుల డిమాండ్

కొత్తవలస, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సుజలస్రవంతి పథకం కింద భూసేకరణ చేస్తున్న మూడు మండలాల్లోని 58 గ్రామాలకు చెందిన రైతులతో చర్చించేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆ పథకం కింద భూములు కోల్పోతున్న రైతులు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తవలసలో భూములు కోల్పోతున్న రైతులు విలేకరులతో మాట్లాడారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు ఉత్తరాంధ్ర సుజలస్రవంతి పథకం కింద తాగు, సాగునీటికోసం కాలువ నిర్మాణానికి భూసేరణ చేసినట్లు చెప్పారు. ఈ భూసేకరణకు సంబంధించి రైతులతో చర్చించాలని కలెక్టర్ అంబేడ్కర్ మంగళవారం తన చాంబర్‌లో అధికారులతో చర్చించారని తెలిపారు. ఎస్.కోట, వేపాడ, కొత్తవలస మండలాల పరిధిలోని నాలుగు గ్రామాల్లో 108 ఎకరాల భూసేకరణపై చర్చించడంపై రైతులు అసహనం వ్యక్తం చేశారు.మూడు మండలాల్లోని 58 గ్రామాల్లో వందలాది ఎకరాలు సేకరించారని, అన్నిగ్రామాల రైతులతోను అధికారులు చర్చించాలని కోరారు. పరిహారం ప్రకటించకుండానే పత్రికల్లో నోటిఫికేషన్ జారీచేశారని తెలిపారు. గ్రామాల్లో మార్కెట్ ధరలో వ్యత్యాసం ఉండడమే కాకుండా బహిరంగ మార్కెట్‌లో భూములు ధరలు కూడా తేడాలు ఉన్నాయని చెప్పారు.ఒకసారి భూమిని కోల్పోతే మళ్లీ భూములను తెచ్చుకోలేమని,దీంతో రైతు ఎంత భూమి నష్టపోతే అంతే భూమిని ఇవ్వడమే కాకుండా కోల్పోయిన భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల వారీగా గ్రామసభలను ఏర్పాటుచేసి రైతులకు ఏవిధంగా న్యాయంచేస్తారో తెలియజేయాలని కోరారు. కొద్ది రోజులు కిందట గ్రామసభల పేరుతో సమావేశాలను నిర్వహించి రైతులు అభిప్రాయాలను తెలుసుకుని కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పి వెళ్లిపోయారని, ఇప్పటి వరకు మళ్లీ ఎటువంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. భూసేకరణ కోసం సర్వే ప్రారంభించి ఇప్పటికే ఏడేళ్లు దాటిపోయిందని తెలిపారు. అప్పటినుంచి తమ భూములను ఎవరికైనా విక్రయించుకోవాలన్నా కొనడానికి ముందుకురావడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం నష్టపరిహారం కూడా ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ మూడు మండలాలలోని 58 గ్రామాలకు చెందిన రైతులతో మాట్లాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బిర్యానీ కోసం వచ్చి..

● ద్విచక్రవాహనం బోల్తాపడడంతో తాటిపూడి యువకుడు మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలోగల చీడిపాలెం వద్ద ద్విచక్రవాహనం బోల్తాపడడంతో ఓ యువకుడు మృతిచెందాడు. సీఐ నారాయణమూర్తి కథనం మేరకు.. గంట్యాడ మండలంలోని తాటిపూడికి చెందిన కొయ్యి శ్రీనివాసరావు(24) అలియస్ (పండు) మంగళవారం రాత్రి తన స్నేహితులతో మండలంలోని బొడ్డవర బిర్యానీ కోసం వచ్చాడు. తన స్నేహితులతో హోటల్‌లో గడిపితిరిగి తాటిపూడి పయణమయ్యాడు. ఈక్రమంలో చీడిపాలెం జంక్షన్ వద్ద ఎదురుగా గొర్రెల మంద రావడంతో వేగానికి నియంత్రించుకోలేకపోవడంతో ద్విచక్రవాహనం బోల్తాపడడంతో శ్రీనివాసరావు కిందపడిపోయాడు. తలకు బలమైన గాయంకావడంతో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం మహారాజ ఆసుపత్రికి రిఫర్‌చేశారు. ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో మృతిచెందాడు. శ్రీనివాసరావు తండ్రి సన్యాసిరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేశారు.

కుక్క అడ్డురావడంతో ఆటో బోల్తాపడి మరొకరు..



తవిటి నాయుడు(ఫైల్

గుర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద బంటుపల్లి-రేగటి గ్రామాల మధ్యలో బుధవారం మధ్యాహ్నం ఆటోబోల్తాపడడంతో ఓవ్యక్తి దుర్మరణం పాలయ్యాడు.ఎస్ఐ నారాయణరావు కథనం మేరకు.. గరివిడి నుంచి వెళ్తున్న ఆటో ఆ గ్రామసమీపంలోగల మలుపు వద్ద కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో స్థానికులు ఆటోను పైకిఎత్తారు. దాని కిందపడి సింగవరం గ్రామానికి చెందిన తవిటినాయుడు మృతిచెందినట్లు గుర్తించారు. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తవిటినాయుడు మృతదేహాన్ని చీపురుపల్లి ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేశారు.

12 మంది బైండోవర్



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రాజాంరూరల్,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):అనధికారంగా గతంలో మద్యం విక్రయించి పట్టుబడిన 12 మంది పాత నేరస్తులపై బీఎన్ఎస్ఎస్ చట్టం-2023 సెక్షన్ 129 కింద రాజాం తహసీల్దార్, మండల మేజిస్ట్రేట్ రాజశేఖర్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు రాజాం ఎక్సైజ్ సీఐ జైభీం తెలిపారు. ఈమేరకు నిందితులకు లక్ష రూపాయల పూచీకత్తుపై ఏడాది కాలానికి బైండోవర్ చేసినట్లు చెప్పారు. బుధవారం రాజాం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్‌లో అక్రమ మద్యం విక్రయిస్తూ పట్టుబడిన వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

522 మద్యం సీసాలు ధ్వంసం

చీపురుపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పోలీసులు 522 మద్యం సీసాలను బుధవారం ధ్వంసం చేశారు. 2024లో నమోదైన 20 ఎక్సైజ్ కేసుల్లో వివిధ రకాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎల్.దామోదరరావు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ మద్యాన్ని స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

గంట్యాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్రీయ గిరిజన వర్సిటీ విద్యార్థి, బొండపల్లి బీజేపీ నాయకుడు పిల్లా నానిబాబుపై దాడిచేసిన గంట్యాడ మండల రెవెన్యూ ఉద్యోగి సిద్దబత్తుల సతీష్‌పై చర్యలు తీసుకో వాలని కేంద్రీయ విశ్వ విద్యాలయం విద్యార్థులు, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గంట్యాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సతీష్‌పై చర్యలు తీసుకోవాలని గంట్యాడ తహసీల్దార్, విజయనగరం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

● నెల్లిమర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూకరాజు



మాట్లాడుతున్న నూకరాజు

నెల్లిమర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పక్కా ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు సహకరించాలని నెల్లిమర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్ ఎం.నూకరాజు కోరారు. బుధవారం నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పక్కా ఓటర్ల జాబితా తయారీకి ఆయా పోలింగ్ స్టేషన్ పరిధిలోని బూత్‌లెవల్ అధికారులు నిత్యం కృషి చేస్తున్నారని తెలిపారు. మృతిచెందిన, వలసవెళ్లిన ఓటర్ల పేర్లు తొలగింపునకు, బూత్‌లెవల్ ఏజెంట్ల జాబితాను త్వరగా పంపించి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు కె.శ్రీకాంత్, ఎస్వీ రమణ, రాజారావు, రమణమ్మ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు, రాజకీయ పక్షాల నాయకులు కనకల పద్మనాభం, ఎం.పాపారావు, డి.కామేశ్వరి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గజపతినగరం,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):గజపతినగరంలో మండలానికి సంబంధించి నలుగురికి, గంట్యాడ మండలంలో ఒకరికి 2లక్షల 96వేల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను టీడీపీ నాయకులు కొండపల్లి కొండలరావు, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు చేతులమీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, మక్కువ శ్రీధర్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

గరివిడిలో అష్టావధానం

గరివిడి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గరివిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం ఎం.నిర్మల ఆధ్వర్యంలోఅష్టావధానం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు తెలుగుభాష గొప్పతనాన్ని వివరించారు.కార్యక్రమంలో అష్టావధానులు వెంకట సుబ్రహ్మణ్యం, సరిపల్లి సోమేశ్వరరావు, ఆవాల యశోదబాబు, శ్రీపాత్ర రాజేశ్వరరావు, ఎ.సత్యశ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓపీఎస్ పునరుద్ధరించాలి

మెరకముడిదాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని(ఓపీఎస్) పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆల్తి రాంబాబు కోరారు. బుధవారం మండలంలోని ఇప్పవలస పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ-2023 వారికి జీవో-57 అమలు చేస్తూ పాత పెన్షన్ అందరికీ అందించాలని కోరారు. ఈయన వెంట సింహాద్రి, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, బాలకృష్ణ ఉన్నారు.

'జనసురక్ష'పై అవగాహన

శృంగవరపుకోట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార బ్యాంక్ ప్రవేశపెట్టిన జనసురక్ష పథకాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని డీసీసీబీ జనరల్ మేనేజర్ కేవీవీ సత్యనారాయణ కోరారు. బుధవారం వేపాడ మండలంలోని వావిలపాడులో జనసురక్ష పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ రవికిరణ్, సూపర్‌వైజర్ నారాయణరావు, సీఈవో అప్పారావు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 149 వినతులు

లక్కవరపుకోట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): లక్కవరపుకోటలో బుధవారం రెవెన్యూ శాఖ అధికారులు రెండోరోజు నిర్వహించిన గ్రీవెన్స్‌లో పదిగ్రామాల రైతులు149 మంది వినతులు అందజేశారు. అత్యధికంగా ఎల్.కోట నుంచి 64 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. ఎక్కువ మంది రైతులు గ్రామ పురోణీల సమస్యపై వినతులు ఇచ్చారని చెప్పారు. పోతీ కేసులు, వెబ్‌ల్యాండ్, అడంగల్‌సవరణపై వెంటనేపరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం

రాజాం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొగిరి జడ్పీ హైస్కూల్‌లో బుధవారం మండల స్థాయిలో స్కూల్‌గేమ్స్ పోటీలు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా ఎంఈవో-1 పి.ప్రవీణ్‌కుమార్‌మాట్లాడుతూ ఇక్కడ ప్రతిభ కనబరిచిన బాలబాలికలు డివిజన్ స్థాయి పోటీలకు, డివిజన్‌స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వై.దుర్గారావు, హెచ్‌ఎం బొంతు పద్మావతి, పీడీలు ఎస్. రమాదేవి, పి.అజయ్‌కుమార్, త్రినాథరావు, సంతోషి, సుజాత, దుర్గారావు, బంగారయ్య, శ్రీనివాస్, అప్పలనాయుడు,సునీల్, హైమావతి, పాల్గొన్నారు.

సెవక్‌తక్రా జట్టు ఎంపిక

నెల్లిమర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అలుగోలు ఉన్నత పాఠశాలలో అండర్- 14, 17, 19 బాలబాలికల విభాగాల్లో సెవక్ తక్రా జిల్లా జట్టు ఎంపిక పోటీలు బుధవారం జరిగాయి.కార్యక్రమంలో హెచ్‌ఎం కస్తూరి, వ్యాయామఉపాధ్యాయులు జి.ధర్మారావు, బి.మహేష్‌రావు, ఎస్.సూర్యారావు, యూఎస్ ఆనందరావు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను అంతర్ జిల్లాల పోటీ లకు పంపించనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

షికారుగంజి విద్యార్థి ..

దత్తిరాజేరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): షికారుగంజి ఆదర్శపాఠశాల పదో తరగతి విద్యార్థి ఎస్.లోకేష్ సెపక్‌తక్రా అండర్-19 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు తెలిపారు. శిక్షణ ఇస్తున్న వ్యాయామఉపాధ్యాయుడు రాజేష్‌ను, ఉపాధ్యాయులను అభినందించారు.

ఊరేగింపును అడ్డుకోవడం తగదు

నెల్లిమర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గణపతి ఉత్సవాల సమయంలో విగ్రహ ఊరేగింపును అడ్డుకోవడం తగదని జైభీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా నాయకులు టాంపల నరసయ్య, కనిగిర శ్రీనివాసరావు తెలిపారు. సతివాడలో ఇటీవల గణపతి ఉత్సవాల సమయంలో తలెత్తిన వివాదం, ఘర్షణ నేపథ్యంలో వారు బుధవారం గ్రామాన్ని సందర్శించారు. అధికారులు దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

సహనం, దయాగుణం కలిగి ఉండాలి

● విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

విజయనగరం బాబామెట్ట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, సహనం, దయా గుణాలు సమాజానికి మార్గ నిర్దేశకాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. బుధవారం విజయనగరంలోని స్విమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి 150వ వసంతాల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరిస్తే మంచి సమాజం నిర్మించగలమని తెలిపారు. కార్యక్రమంలో సంఘమిత్ర ఆర్ఎస్ జాన్, వై.ప్రభాకర్, ఎంఏ నాయుడు, టి.ఆనందరావు, సుగుణకరరావు, ఆర్ఎస్ఏ కుమార్, కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పైడిమాంబ జాతరకు 900 మంది కార్మికులు

● విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ జాతర పురస్కరించుకుని రెండురోజులు 900 మంది ప్రత్యేక పారిశుధ్య కార్మికులను వినియోగించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. పైడిమాంబ జాతర నాటికి నగరంలోని అన్ని ప్రధాన, చిన్న కాలువల పరిశుభ్రంగా ఉండాలని ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశించారు. బుధవారం విజయనగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య బృందాలతో కాలువల్లో చెత్త ప్రక్షాళన ప్రక్రియ చేపట్టారు.కాలువల పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రజారోగ్య అధికారి డాక్టరు కొండపల్లి సాంబమూర్తి దగ్గరుండి పర్యవేక్షించి సూచనలుచేశారు. ఈనెల 20 నాటికి నగరపాలక సంస్థకి సంబంధించి అవసరమైన అన్ని పనులను పూర్తి చేసేందుకు సిబ్బందికి నిర్దేశించామని కమిషనర్ తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

వ్యాధులు ప్రబల కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ పి.నల్లనయ్య సూచించారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు దోమలు వృద్ధి చెందే అవకాశం ఉండడంతో యాంటీ లార్వా ఆపరేషన్‌ను విస్తృతం చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చీపురుపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు డిమాండ్‌చేశారు. బుధవారం రామలింగపురం పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాలుగు విడతల డీఏలు మంజూరు చేయాల్సిఉందని తెలిపారు. సమావేశంలో పి.రవికిషోర్, కంది గోపి, ఎం. జగన్నాథం పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

● జిల్లా వ్యవసాయాధికారి రామారావు



డెంకాడ: రైతులతో మాట్లాడుతున్న రామారావు

డెంకాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వరి పంటకు రెండో దఫాగా యూరియా చల్లకుండా నానో యూరియా ఎకరానికి 500 లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీరామారావు తెలిపారు. దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వస్తుందని చెప్పారు. బుధవారం డెంకాడలో పొలంపిలుస్తోంది, యూరియా మీచెంతకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండుమూడు రోజుల్లో కొన్ని రైతుసేవా కేంద్రాలకు యూరియా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ చంద్రశేఖరరావు, సహాయ వ్యవసాయసంచాలకుడు ఎ.నాగభూషణరావు, ఏవో టి.సంగీత, వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకోటి, పాణిరాజు, వీఏఏలు అపర్ణ, లిను పాల్గొన్నారు.

అవసరమైన మేరకే యూరియా వినియోగించాలి

కొత్తవలస, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని ఏవో కేవీ రాంప్రసాద్ తెలిపారు. బుధవారం కొత్తవలస రైతు సేవాకేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అవసరం మేరకే యూరియా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది గణేస్, కుమారి, రవి ప్రకాష్ పాల్గొన్నారు.

● గజపతినగరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):నానో యూరియా ప్రతి ఒక్కరూ వినియోగించాలని ఏవో కిరణ్‌కుమార్ తెలిపారు.బుధవారం మండలంలోని లోగిస, మరుపల్లిల్లో నానోయూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.

జీఎన్‌పురంలో 'పొలం పిలుస్తుంది'

సంతకవిటి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):మండలంలో మంతిన, జీఎన్‌పురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏవో సీటీ యశ్వంత్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈసందర్భంగా వరి పొలాలను పరిశీలించి సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ పావని, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో విఫలం

నెల్లిమర్ల,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):రైతులకు యూరియా సకాలంలో అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ మండల కార్యదర్శి ముయ్యద పాపారావు ఆరోపించారు.బుధవారం నెల్లిమర్లలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన యూరియా అందించాలని డిమాండ్ చేస్తున్నా అరకొరగా సరఫరా చేయడం వల్ల రైతులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు.

సిబ్బంది సమయ పాలన పాటించాలి: పీడీ

గంట్యాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) సిబ్బంది సమయపాలన పాటించి కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని ఐసీడీఎస్ పీడీ విమలరాణి కోరారు. బుధవారం గంట్యాడలోని అంగన్‌వాడీ కేంద్రాలనుతనిఖీచేశారు.ఈ సందర్భంగా స్టాక్, రికార్డులను పరిశీలించారు. పిల్లలకు మెనూ సక్రమంగా అందించాలని సూచించారు. ఆమెతో పాటు పీవో ఉమాభారతి, సిబ్బంది ఉన్నారు.

మహిళల్లో చైతన్యం రావాలి

గుర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళల్లో చైతన్యం రావాలని ఈవోపీఆర్‌డీ అన్నపూర్ణాదేవి కోరారు. బుధవారం గుర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంతో పాటు బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాలకు పందిరిరాట



కుమరాం వద్ద దసరా నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న భక్తులు

జామి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కుమరాం వద్ద దసరా నవరాత్రుల నిర్వహణకోసం పండుగ రాటను వేశారు. బుధవారం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య రాట వేసి పూజలుచేశారు.

● రాజాం రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ముహూర్తపు రాట కార్యక్రమాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్త వానపల్లి నరసింగరావుతో ప్రధాన అర్చకుడు శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఈవో శ్యామలరావు, గురుభవాని కూరాడ వెంకటరావు, దాసరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చీపురుపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలోహుండీల ద్వారా రూ.1,47,177లు ఆదాయంలభించింది. జూలై 16 నుంచి ఈనెల పదో తేదీ వరకూ భక్తులు హుండీల్లో వేసిన కానుకలను బుధవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఈవో బండ్లమూడి శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డు ప్రతినిధి గవిడి నాగరాజు, లెంక చిన్నారావు, ఇప్పిలి పార్వతి పాల్గొన్నారు.

నారాయణమూర్తి జీవన విధానం స్ఫూర్తిదాయకం

రాజాం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు ఆర్.నారాయణమూర్తి జీవన విధానం ఎంతోమందికి స్ఫూర్తి దాయకమని టీడీపీ సీనియర్ నాయుకుడు కోండ్రు జగదీష్ తెలిపారు. బుధవారం రాత్రి శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో జగదీష్‌ను కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గురవాన నారాయణరావు, శాసపు రమేష్‌కుమార్, నాగళ్ల అప్పలనాయుడు, కొల్లు రవీంద్ర, బోనెల నారాయణరావు పాల్గొన్నారు.

కొండదాడిలో 'సంకల్పం'

గరివిడి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళలకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందని ఐసీడీఎస్ గరివిడి పీవో ఎన్.ఆరుద్ర తెలిపారు. బుధవారం మండలంలోని కొండదాడి ఎంపీయూపీ పాఠశాలలో సంకల్పంకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ గ్రూపు సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, చట్టం, న్యాయపరంగా పొందాల్సిన హక్కులను వివరించారు. మహిళలు, బాలికలను ఎవరైనా వేధింపులకు గురిచేసినా, మానసికంగా, శారీరకంగా హింసించినా అటువంటి వారిపై ప్రభుత్వం తీసుకుంటున్న కఠినమైన శిక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జ్యోతి, పాఠశాల హెచ్‌ఎం బి.ఆనందరావు, సర్పంచ్ ఎం.గౌరమ్మ పాల్గొన్నారు.



అర్థాంతరంగా నిలిచిపోయిన రైతు సేవా కేంద్రం పనులు

బిల్లులు కాక.. పనులు పూర్తి చేయక

● అర్థాంతరంగా నిలిచిపోయిన భోగాపురం రైతు సేవా కేంద్రం

భోగాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):భోగాపురంలో రైతు సేవా కేంద్రం నిర్మాణం బిల్లులు కాకపోవడంతో నిలిచిపోయింది. వైసీపీ ప్రభుత్వం హయాంలో గ్రామ సచివాలయాలకు ఆనుకుని ఆర్బీకే భవన నిర్మాణాలుచేపట్టారు.టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్బీకే పేర్లను రైతు సేవా కేంద్రం మార్చింది. ప్రస్తుతం భోగాపురంలోని రైతు సేవా కేంద్రం ఇరుగ్గా ఉండే అద్దెభవనంలో నిర్వహిస్తున్నారు. దీనికితోడు భోగాపురంలో మండల వ్యవసాయ కార్యాలయం కూడా లేదు. వ్యవసాయ రంగానికి సంబంధించి రెండు విభాగాలకు సొంతభవనాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి రైతు సేవా కేంద్రం నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు రైతులు కోరుతున్నారు.



ముక్కాంలో శిథిలావస్థకు చేరిన సామాజిక భవనం

మరమ్మతులు లేక.. అవస్థలు తప్పక

● వలలు భద్రపరచడానికి మత్స్యకారుల బేజారు

● తీరప్రాంతంలో శిథిలావస్థకు చేరిన సామాజిక భవనాలు

భోగాపురం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కాం, కొండ్రాజుపాలెం తీరప్రాంతంలోగల గ్రామాల్లో మత్స్యకారుల కోసం నిర్మించిన సామాజిక భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దశాబ్దాల కిందట నిర్మించిన ఈభవనాలు కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూర్తి పాడయ్యాయి. ఇక్కడ మత్స్యకారులు ఖాళీ సమయంలో సేదదీరడంతోపాటు వేట సామగ్రి మరమ్మతులు చేసుకోవడం, వలలు భద్రపరచుకోవడానికి ప్రభుత్వం సముద్రతీర ప్రాంతాల్లో సామాజిక భవనాలు నిర్మించింది.అయితే వలలు భద్రపరచుకునే భవనాలు ప్రస్తుతం పూర్తిగాపాడవడంతో ఇబ్బందిపడుతున్నామని,ఇళ్లకు వలలు తీసుకువెళ్లాల్సివస్తోందని పలువురు వాపోతున్నారు. భవనాల శ్లాబు పైభాగంగా నుంచి పెచ్చులూడి పడుతుండడంతో మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కొత్త సామాజిక భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

మున్సిపాలిటీకి రూ.2 కోట్లు

● మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ రూ.2 కోట్లను విడుదల చేశారని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధుల మంజూరు విషయాన్ని వెల్లడించారు. ఇటీవల మున్సిపల్ చైర్మన్ రాంబాబుతో సహా తాను మంత్రి నారాయణను కలిసి పట్టణంలో సమస్యలను వివరించామన్నారు. మురుగునీటి కాలువలు, రోడ్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని, వీటికోసం నిధులు విడుదల చేయాలని కోరామన్నారు. అందుకు మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించి వెంటనే నిధులు విడుదల చేయించారన్నారు. డ్రైనేజీ పనుల పటిష్టతకు ఎక్కువగా వినియోగించాలని మంత్రి సూచించారన్నారు. ఇందుకు మంత్రి నారాయణకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

గత ప్రభుత్వ నిర్వాకంతో పెరిగిన వ్యయం..

గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అప్పటి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవతో పట్టణానికి రూ.90 కోట్లతో తాగునీటి పథకం మంజూరైందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా తాగునీటి పథకం చతికిలపడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత మున్సిపల్ మంత్రి నారాయణ ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న తాగునీటి పథకాలన్నింటినీ పూర్తిచేయాలని నిర్ణయించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించి ఏపీయూఎఫ్ఐబీ పథకంలో సువర్ణముఖి నుంచి తాగునీటిని బొబ్బిలి పట్టణానికి అందించేదుకు పక్కా చర్యలు చేపట్టారన్నారు. వైసీపీ పాలకుల పుణ్యమా అని ఈ పథకం నిర్మాణ వ్యయం రూ. 90 కోట్ల నుంచి రూ. 120 కోట్లకు చేరుకుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, కమిషనర్ లాలం రామలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

పీహెచ్‌సీని సందర్శించి.. రోగులతో మాట్లాడి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) పిరిడిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే బేబీనాయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో సదుపాయాలు, చికిత్స విధానాలపై ఆరా తీశారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ రఘువంశీతో మాట్లాడి ఆసుపత్రిలో సమస్యలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి మీటింగ్ హాల్ అవసరమని డాక్టర్ తెలియజేయడంతో అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మీటింగ్ హాల్ నిర్మాణానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పర్యటనకు వెళ్లి.. నేపాల్‌లో చిక్కుకుని

(ఐదో పేజీ తరువాయి)

రోయల్ కుసుమ్ అనే హోటల్లో ఉన్నారు. వారిలో గాజులరేగకు చెందిన గోవింద అనే వ్యక్తితో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, విజయనగరం తహసీల్దార్ కూర్మనాథ్‌లు ఫోన్‌లో మాట్లాడారు. అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తాము క్షేమంగా ఉన్నట్లు యాత్రికులు వివరించారు. ఢిల్లీలోని ఏపీ భవన్ నుంచి ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారని తెలిపారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ, సెర్ప్ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా యాత్రికులతో మాట్లాడి భరోసా కల్పించారు. ఇదిలా ఉంటే జిల్లాలోని అన్ని మండలాల్లో తహసీల్దార్‌ల నుంచి కలెక్టరేట్ అధికారులు యాత్రీకల కుటుంబీకుల వివరాలు సేకరించారు. అందరూ క్షేమంగా ఉన్నారని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఎరువు కొరత ఉందా?

(ఐదో పేజీ తరువాయి)

ఉంటుంది. ఐతే కొందరు రైతులు మలివిడత నాటికి ఎరువు లభిస్తుందో లేదోనన్న భయంతో మొత్తం రెండు విడతలకు కలిపి ఒకేసారి కొనుగోలు చేస్తుండడం వల్ల తొలివిడతలోనే కొరత కనిపిస్తోంది. అంతేకాకుండా కొందరు రైతులు యూరియా ఎంత ఎక్కువ వేస్తే దిగుబడి అంత ఎక్కువగా వస్తుందన్న అమాయకత్వంతో ఎకరాకు రెండు విడతల్లో వేయాల్సిన 40 కిలోలను తొలి విడతకే వేసేస్తున్నారు.

● ప్రభుత్వ సబ్సిడీ ఎక్కువగా ఉండడం కూడా యూరియా వైపు మొగ్గు చూపడానికి కారణమవుతోంది. అసలు ధర రూ.2234 కాగా రూ.1967 చొప్పున ప్రభుత్వం సబ్సిడీ ఇస్తూ కేవలం రూ.266కు సరఫరా చేస్తోంది. డీఏపీ అసలు ధర 2740 కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.1390 పోను రూ.1350 చొప్పున విక్రయాలు జరుగుతుంటాయి. అతి తక్కువ ధరకు సరఫరా కావడం యూరియా వాడకానికి మరో కారణంగా వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

● అలాగే యూరియాను వరితోపాటు పామాయిల్, అరటి, మొక్కజొన్న, పత్తి వంటి వాణిజ్య పంటలకు కూడా కొందరు మళ్లిస్తున్నారు.

మెంటాడలో కొరత లేదు

మెంటాడ మండలంలోని పరిస్థితులు పరిశీలిస్తే అసలు యూరియా కొరత లేనేలేదని స్పష్టమవుతోంది. ఈ మండలంలో వరిసాగు వరిసాగు విస్తీర్ణం 7664 ఎకరాలు. ఎకరాకు వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం ఖరీఫ్‌లో ఎకరాకు 40 కిలోల యూరియా చొప్పున మొత్తం 7664 ఎకరాలకు 3 లక్షల 6వేల 560 కిలోల యూరియా అవసరం. ఈ సీజన్లో ఇప్పటివరకు 700 టన్నులు అంటే 7లక్షల కిలోల యూరియా సరఫరా చేశారు. అంటే డిమాండ్ కన్నా రెట్టింపు యూరియా రైతులకు అందించారు. అయినా కొరత అంటూ రైతులు గగ్గోలు పెట్టడంపై వ్యవసాయ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. రెండు, మూడు విడతలది ఒకేసారి కొని నిల్వ చేసుకుంటున్నవారు కొందరైతే, ఇతర వాణిజ్యపంటలకు కూడా వాడడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు.

● జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఫలితంగానే యూరియా 'కొరత' అంశం కుదిపేస్తోంది. రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లు, ప్రైవేట్ డీలర్లు ఇలా అన్ని చోట్లా అవసరం మేరకు సరఫరా జరిగినా ఆందోళనలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని వ్యవసాయ వర్గాలు అంటున్నాయి. స్వయంగా జిల్లా కలెక్టర్ కూడా ఇదేమాట పదేపదే చెబుతున్నారు.

అప్పుడప్పుడే తనిఖీలు

(ఐదో పేజీ తరువాయి)

40 కిలోమీటర్ల పొడవునా హైవే విస్తరించి ఉంది. ఎక్కువగా జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవేపై రోజుకు సగటున 5 నుంచి 6 వేల వరకూ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కనీసం నెలలో ఐదుసార్లు అయినా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలి. అయితే హైవేల్లో ఎక్కడా చేస్తున్న దాఖలాలు లేవు. పట్టణాలకే పరిమితమై పోతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా కరోనా తరువాత డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు తగ్గుముఖం పట్టాయి. బ్రీత్ అనలైజర్ టెస్టులతో కరోనాతో పాటు వ్యాధుల వ్యాప్తి అధికంగా ఉంటుందన్న విశ్లేషణలు వచ్చాయి. ఇప్పుడు అదే సాకు చూపి పరీక్షలు తగ్గిస్తున్నట్టు తెలుస్తోంది.

తనిఖీలు పెంచుతాం

పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నాం. కేసులు సైతం నమోదు చేస్తున్నాం. షాపుల వద్ద ఉన్నవారిని తీసుకెళ్లి కేసులు నమోదు చేస్తామని చెబుతుండడం అవాస్తవం. రహదారులపై మరింతగా నిఘా పెంచుతాం. మద్యం తాగి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తాం.

- హెచ్.ఉపేంద్ర, సీఐ, రాజాం

కోరాడ వీధిలో కుక్కల బెడద


గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

బొబ్బిలి/రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కోరాడ వీధిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దారిన పోయే వారిపై దాడికి తెగబడుతున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఒంటరిగా వెళ్తున్నవారు, వాహనాలపై వెళ్లేవారిని కుక్కలు వెంబడించి దాడికి యత్నిస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వీధుల్లోనూ గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

పనులు సర్దుబాటు చేయాలి


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులతో పనులు సర్దుబాటు చేయాలని అధికారులను జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ శాఖ పనితీరు, సమస్యలపై జేసీ, డీఆర్‌వో నిర్వహించిన వెబ్ ఎక్స్ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీను, ఆర్ఐ రాంకుమార్, ఈడీటీ గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌వోల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. వర్క్ డిస్ట్రిబ్యూషన్ చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే సమస్యల పరాష్కారం వేగవంతం చేయాలన్నారు. పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు.

రోడ్లపై గోతులు పూడ్చిన పోలీసులు


గోతులను పూడ్పిస్తున్న పోలీసులు

రామభద్రపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోడ్లపై గోతులను బుధవారం పోలీసులు పూడ్పించారు. బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు ఆధ్వర్యంలో పనులు జరిగాయి. రామభద్రపురం నుంచి రాజాం వెళ్లే రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటమే కాకుండా తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో పోలీసులు స్పందించారు. స్థానిక కాంట్రాక్టర్ బి.శేఖర్ ఆర్థిక సహకారంతో రోడ్లపై గోతులను మెటల్, సిమెంట్‌తో పూడ్పించారు. సుమారు 10 మీటర్ల మేర గోతులను పూడ్పించి రోలర్‌తో చదును చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెలమల ప్రసాద్ ఉన్నారు.

కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రక్షణ చట్టాలపై బాలికలకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ సెక్టర్ సూపర్‌వైజర్ ప్రభావతి అన్నారు. నారసింహునిపేట, కలవరాయి ఉన్నత పాఠశాలల్లో బుధవారం సఖి, యువ గ్రూపు తరఫున కిశోరి బాలికలకు పోక్సో చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్ టచ్-బాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలవరాయి సెక్టర్ సూపర్‌వైజర్ వై.రాజు, సుబ్బలక్ష్మి, మహిళా పోలీసు, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

బొబ్బిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే బేబీనాయనను ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. బుధవారం సాయంత్రం బొబ్బిలి కోటలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.మణి కుమార్ మాట్లాడుతూ పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. మెస్ చార్జీలను రూ. 3 వేలకు పెంచాలన్నారు. బొబ్బిలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ఉచితబస్సు సౌకర్యం కల్పించాలన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు సమకూర్చాలన్నారు. వీటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

యూరియా కష్టాలు తప్పించలేరా?

బొబ్బిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేదని నాయకులు, అధికారులు చెబుతుండటం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యా లయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులంతా యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్ కార్యాలయాలు, వ్యవసాయశాఖ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగు తున్నారన్నారు. రైతుల కష్టాల పాలకపక్షం కంటపడకపోవడం విచిత్రంగా ఉందన్నారు. రైతులకు అవసరానికి మించి యూరియా నిల్వలు కేటాయించామని చెబుతున్న అధికారులు.. అవన్నీ ఎక్కడకు వెళ్లాయో చెప్పాలన్నారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వారి భరతం పట్టలేరా అని ప్రశ్నించారు. ఇకనైనా యూరియా సరఫరాకు పగడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అప్పన్న, శ్రీనివాస్, వై.బాబ్జీ పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

బాడంగి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తహసీల్దార్ కె.వరప్రసాద్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి వీఆర్వో, గ్రామ సర్వేయర్ ఇద్దరూ విధిగా ఉదయం 10 నుంచి 1 గంట వరకు సచివాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. రైతుల నుంచి వచ్చే దరఖాస్తులు ఆఫ్‌లైన్‌లో స్వీకరించి రెవెన్యూ రికార్డులో నమోదు చేయాలన్నారు. అనంతరం అదే రోజు రెవెన్యూ కార్యాలయంలో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే ప్రభుత్వం జాయింట్ ఎల్‌పీ నెంబర్లు ఉన్న సర్వే నెంబర్లకు డిసెంబరు వరకు గడువు ఇచ్చిందన్నారు. దీన్ని రైతులు రూ.50ల రశీదుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇదే విషయమై గ్రామాల్లో వీఆర్వోల ద్వారా దండోరా వేయాలన్నారు. ప్రస్తుతం నేపాల్ దేశంలో అల్లర్లు జరుగుతున్న చోట బాడంగి మండలానికి చెందిన వారు ఎవరైనా ఉంటే ఆ వివరాలు సేకరించి కార్యాలయానికి అందించాలన్నారు. సమావేశంలో మండల సర్వేయర్ సతీష్, రీసర్వే టీడీ అప్పలనాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించే టప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని పాలకొండ అగ్నిమాపకశాఖ అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం బుడగరాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో అగ్ని ప్రమాదాలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నిర్లక్ష్యం మాటున మరుగుదొడ్లు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వేలాది రూపాయల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు, ఇతర శిక్షణ కార్యక్రమాలు, వివిధ పనులపై వచ్చేవారికి, కార్యాలయం సిబ్బందికి సౌకర్యంగా ఉంటుందనే ఉద్దేశంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మూడేళ్ల కిందట మరుగుదొడ్లను నిర్మించారు. అయితే మరుగుదొడ్లను ప్రస్తుతం వినియోగించే పరిస్థితిలో లేవు. వాటిని పిచ్చి మొక్కలు చుట్టేశాయి. దాంతో ప్రస్తుతం అవి వినియోగానికి దూరంగా ఉన్నాయి. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు, మహిళా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.


పిచ్చిమొక్కల మధ్య మరుగుదొడ్లు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర, పెద్దూరు గ్రామానికి చెందిన అల్లు సత్యనారాయణ, పైల జగదీశ్ అనారోగ్యానికి గురైన నేపథ్యంలో వారికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. బుధవారం క్యాంప్ కార్యాలయంలో అల్లు సత్యనారాయణకు రూ.1,85,000, పైల జగదీశ్‌కు రూ.1,69,323 చెక్కులను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో గరుగుబిల్లి మండల నాయకులు మరడాన తవిటినాయుడు, ముదిలిబాబు, నారాయణస్వామి నాయుడు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీపీటీవో

పార్వతీపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా పరిధిలోని ప్రజా రవాణా సమస్యలపై 12న డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 99592 25605 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని ఆయన కోరారు.

14న రాష్ట్రస్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

పాలకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు ఈ నెల 14న పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక జరగనుందని కబడ్డీ జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడు పల్లా కొండలరావు, అధ్యక్షుడు కోడి సుదర్శనరావు, కార్యదర్శి వెన్న చంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. పురుషులు 75 కేజీల లోపు, మహిళలు 65 కేజీల లోపు ఉండాలన్నారు. వయస్సు 1-1-2006 తర్వాత జన్మించి, 20 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 22 నుంచి 25 వరకు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రదేశానికి హాజరుకావాలన్నారు. వివరాలకు 9948066185, 9603305767 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయ డిమాండ్లపై స్పందించాలి

సాలూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యో): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మీసాల వెంకట గౌరీశంకరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పెండింగ్ డీఏలు, ఆర్జిత సెలవుల ఎన్‌క్యాష్‌మెంట్, పీఆర్సీ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటన, సీపీఎస్ రద్దు యాప్‌లు, అసెస్మెంట్ భారం తగ్గింపు తదితర వాటిని ప్రభుత్వం తీర్చాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11 నుంచి 17 వరకు ఉపాధ్యాయులు పోరాటపథంలో నడవాలన్నారు. ఈ నెల 11న నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరుకావాలన్నారు. 12న మండల కేంద్రాల్లో, 13, 14 తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వడం, 15న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన తెలియజేయాలన్నారు. ఈ నెల 17న సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, ఈ మెయిల్ ద్వారా వినతులు అందజేయాలన్నారు. కార్యక్రమాలకు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయులు ప్రజల్లో భాగమేనని ప్రభుత్వం గుర్తించి ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

పార్వతీపురం రేంజర్‌గా మణికంఠేష్


రేంజర్‌ను అభినందిస్తున్న దృశ్యం

పార్వతీపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం రేంజర్‌గా మణికంఠేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన రామ్‌నరేష్ రామ్‌నరేష విజయనగరం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మణికంఠేష్ మాట్లాడుతూ అటవీశాఖ ద్వారా ప్రజలకు అందించాల్సిన సేవలను పూర్తిస్థాయిలో అందించడమే లక్ష్యమన్నారు. కార్య క్రమంలో అటవీశాఖ అధికారులు మనోజ్ తదితరులున్నారు.

నారంశెట్టికి 'కార్యర్షి' పురస్కారం

బెలగాం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన బాల సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావుకు కార్యర్షి పురస్కారం వరించింది. ఈ నెల 7న హైదారాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలోని ఆడిటోరియంలో జరిగిన మహాకవుల జయంత్యు త్సవ సభలో మహాకవి కాళోజి స్మారక కార్యర్షి పురస్కారాలను వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులకు ప్రదానం చేశా రు. బాల సాహిత్యంలో నారంశెట్టి చేసిన సేవలకు గానూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డా.నందిని సిదారెడ్డి ఆధ్వర్యంలో నారంశెట్టికి పురస్కారం ప్రదానం చేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

గరుగుబిల్లి/ సీతానగరం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం రావివలస మీదుగా సారా తరలిస్తున్న చిన మేరంగి గ్రామానికి చెందిన రాగోలు రత్నకుమార్‌ను ఈఎస్‌టీఎఫ్ సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం అరెస్టు చేశారు. మూడు క్యాన్లతో 60 లీటర్ల సారా ద్విచక్ర వాహనంపై ఒడిశా - ఆంధ్రా సరిహద్దు గ్రామం సందుబడి నుంచి జిల్లాలో గరుగుబిల్లి, వీరఘట్టం మండలాలకు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నామని సీఐ తెలిపారు.

బాలిక ఆచూకీ లభ్యం

జియ్యమ్మవలస, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పిప్పల భద్రకు చెందిన అదృశ్యమైన బాలిక ఆచూకీని బుధవారం పోలీసులు కను గొన్నారు. నెల్లూరు జిల్లా ఆకివీడు సమీపంలో గుమ్మలపాడు వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 6న బాలిక అదృశ్య మైందని ఆమె తండ్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాని పై స్పందించిన ఎస్ఐ అనీష్ అదృశ్యమైన బాలిక ఆచూకీ గుర్తించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించ నున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్


రంగరాయపురం పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఇదే..

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధ జలం అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఆర్.రంగరాయపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్ కొన్ని నెలలుగా పని పచేయడం లేదు. దీంతో పాఠశాలలో ఉన్న 68 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

● ఈ విషయంపై హెచ్‌ఎం వెంకటరమణను వివరణ కోరగా ఇటీవలే తాను ఇక్కడ బాధ్యతలు స్వీకరించానన్నారు. మెకానిక్‌కి సమాచారం ఇచ్చామన్నారు. త్వరలో ప్లాంట్ వినియోగంలోనికి తీసుకువస్తామన్నారు.